# కథావేదిక

ప్రతినెలా వైవిధ్యంగల కథలను అందిస్తూ కథాప్రియులకు వెతుక్కునే పనిలేకుండా కథలన్నీ ఒకేచోట చేర్చి, కత్తిరించి పొందుపరచుకుంటే చక్కని కథల సంకలనంలా మారీ, మంచి కథను మళ్లీ మళ్లీ చదువుకునే చక్కని అవకాశాన్ని పాఠకులకు కలిగించే వినూత్న ప్రక్రియ... ఈ కథావేదిక.



## రాంపండు శోభనం

- ముచ్చర్ల రజనీ శకుంతల

ఆఫీసు నుండి అలసటగా వచ్చి కుర్చీలో వాలాడు రాంపండు.

‘‘ఏరా రాంపండూ ఇవాళయినా ఇల్లు దొరికిందా లేదా?’’ బామ్మగారు కాఫీ గ్లాసు అందిస్తూ అంది.

‘‘ఎక్కడే బాబు ఈ భాగ్యనగరంలో రెండుగదులున్న ఇల్లు దొరకాలంటే ఓ బ్రహ్మప్రళయం అయిపోయింది. నావల్ల కాదుబాబూ ఇక. నీకు ఓపిక వుంటే నువ్వు చూసుకో. లేకపోతే లేదు. నన్ను చంపకు’’ నీర్సంగా అన్నాడు రాంపండు.

‘‘అదేవిట్రా! ఇప్పటికే ఇల్లు దొరక్క అమ్మాయిని తీసుకురావడం లేటయిపోయింది. వాళ్ల నాన్న, అమ్మ ఏమనుకుంటారు చెప్పు. పెళ్లి చేసుకుని ఉడాయించారు. కాపురానికి అమ్మాయిని తీసుకెళ్లరా అని చెప్పుతారు.’’

‘‘నన్నేం చెయ్యమంటావే? పెళ్లి అప్పుడే వద్దు మొర్రో అంటే పిల్ల బావుందిరా అని చేశావ్. నువ్వే ఏదో ఒకటి ఆలోచించు.’’

‘‘ఇది మరీ బావుంది. మగాడివి నువ్వే తిరిగి ఇల్లు వెతకలేకపోతే ముసలిదాన్ని నాకేం చేతనవుతుంది.’’

‘‘అయితే నోరు మూసుకుని ఊరుకో. లక్ష్మిని తీసుకు రమ్మని అడగకు’’ మరింత కోపంగా అన్నాడు రాంపండు.

‘‘సోద్యం కాకపోతే ఇల్లు దొరకలేదని పిల్లని కాపురానికి తీసుకురాకపోతే అందరూ ఏమనుకుంటార్రా. నీకేం తెలియదుగానీ రేపు ఉదయాన్నే అమ్మాయికి ఫోన్ చేసి చెప్పు వెంటనే బయలుదేరమని.’’

‘‘మరి ఇల్లు’’

‘‘ఎలాగోలా సర్దుకుందాం. ఏం చేస్తాం. ఈలోగా అందరికీ నేనూ చెప్పి పెడతాలే. అదృష్టం బావుంటే దొరుకుతుంది. లేకపోతే దొరికేవరకూ ఎలాగోలా సర్దుకుందాం. సరేనా?’’

‘‘సరే అనక చస్తానా! ఏ ముహూర్తంలో పుట్టావే బామ్మా. ప్రతీదీ నీమాటే చెల్లాలంటావు. తాతయ్య ఎలా వేగేవాడో ఏమో నీతో’’

‘‘ఆయనకేంరా. నేనెంత చెప్తే అంత’’ గర్వంగా అంది ముసిముసిగా నవ్వుతూ.

‘‘ఆ ఆయనగారు అలవాటు చేశారు. ఇప్పుడు నువ్వు నా నెత్తిన ఎక్కి కూర్చున్నావు...’’

‘‘ఒరే రాంపండూ లక్ష్మిని తీసుకు రమ్మన్నాననేగానీ కోపం అంతాను. చూడు పెళ్లి జరిగి నెల దాటుతోందా. ఆ అమ్మాయి మాత్రం ఏమనుకుంటుంది చెప్పు. ముచ్చటగా మూడు ముక్కలయినా మాట్లాడతారా ఆమెతో? అదేం ఖర్మో, పెళ్లి బాగానే జరిగినా, శోభనం వాయిదా పడింది వాళ్ల బాబాయి చావుతో. ఆ ముచ్చట కాస్తా ఇక్కడ జరిపించేస్తే ఏం గొడవా వుండదు.



## నొప్పి

భర్తపోయిన కాంతాన్ని పలకరించటానికి వెళ్ళిన నిర్మల అడిగింది-

''ఎలా పోయారాయన?'' అని.

''మొన్న కాళ్ళు నొప్పిగా వున్నాయి పట్టమన్నారు. నిన్న నడుము నొప్పి అన్నారు. పట్టాను. ఈవేళ గొంతు నొప్పి అన్నారు, అంతే!'' అంది కాంతం.

- చందూవంశీ (ప్రొద్దుటూరు)

## నక్షత్రాలు

''ఇందాకట్నుంచీ అడుగుతున్నాను ఈ ఫయివ్‌స్టార్ హోటల్‌లో నక్షత్రాలు ఎక్కడా కనబడటంలేదని. చూపిస్తాను, చూపిస్తానని చెప్పి ఇంకా చూపించలేదు అసలెప్పుడు చూపిస్తావ్!'' కోపంగా సర్వర్‌ని అడిగాడు ఓ నిషారాయుడు.

''ఒక్క అరనిమిషం ఓపిక పట్టండిసార్ 'బిల్' వచ్చేస్తుంది...'' వినయంగా చెప్పాడు సర్వర్.

## లావు


''మీలావు తగ్గాలంటే రోజూ రాత్రిపూట రెండు చపాతీలు మాత్రమే తినండి.'' మధుతో చెప్పాడు డాక్టర్.

కొన్నాళ్ళకు మరింత లావెక్కి వచ్చాడు మధు.

''నేను చెప్పినట్లు చేసారా?'' అడిగాడు డాక్టర్.

''అయ్యో! మీరు చెప్పినట్టే రోజూ రాత్రిపూట భోజనం చేసాక రెండంటే రెండు చపాతీలు మాత్రమే తినేవాడినండీ.'' దిగులుగా చెప్పాడు మధు.

- పెనుమాక దేవానంద్‌శ్రీ (ధర్మవరం)




అయినా పండూ నీకు మాత్రం ఆత్రంగా లేదూ ఆ అమ్మాయితో మాట్లాడాలని...'' నవ్వుతూ అంది బామ్మ.

రాంపండుకు పెళ్లి బట్టల్లో వున్న లక్ష్మి గుర్తొచ్చింది. సన్నగా, సన్నజాజితీగ లాంటి ఆ నడుము, పొడుగుకు తగ్గ లావు, పొడిగాటి జడ, నవ్వితే సొట్టపడే ఆ బుగ్గ, కింది పెదవి దగ్గర చిన్న పుట్టుమచ్చ.

రాంపండు శరీరం తీయగా మూలిగింది. బామ్మ అతని ముఖాన్ని పరీక్షగా చూస్తూ ''నాకేం. నీకు మరీ ఇష్టం లేకపోతే ఫోన్ చెయ్యడం మానేయ్. ఇల్లు దొరికాకే ఆర్నెల్లయినా పర్లేదు. అప్పుడే తీసుకువద్దాం'' అంది.

''వద్దులే రాత్రికి వెళ్లి ఫోన్ చేసి వస్తాను'' గబగబా అన్నాడు పండు. నీ వేషాలు నాదగ్గరా అనుకుంది అనుభవంతో తల పండిన ఆ బామ్మ.

• • •

రాంపండు ఎల్.ఐ.సి.లో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. చిన్నతనంలోనే తల్లి తండ్రీ చనిపోతే మనవణ్ణి పెంచుకుంటూ వచ్చింది బామ్మగారు.

ఆవిడకి రాంపండంటే బోలెడంత ప్రేమ.

ఏదో నాలుగురాళ్లు సంపాదిస్తున్నాడు. ఓ ఇంటివాణ్ణి చేసేస్తే తనీ క్షణంలో గుటుక్కుమన్నా బాధ వుండదని అన్ని సంబంధాల్లోని తనకి వచ్చిన మహాలక్ష్మిని ఇచ్చి పెళ్లి జరిపించింది.

మహాలక్ష్మికి ఏ వంకా లేకపోవడంతో పెళ్లికి వప్పుకున్నాడు పండు. అయితే అతనికి ఒకటే కష్టంగా వుంది. అతను వుండేది ఒకటే గది, చిన్న వంటిల్లు. ఇన్నాళ్లూ అయితే వుండేది అతనూ, బామ్మే కాబట్టి ఏం కష్టం లేకుండాపోయింది. ఇప్పుడు లక్ష్మి వస్తే బామ్మ ఎక్కడ పడుకోవాలని అతని బాధ. పోనీ వంటింట్లోనే ఎలాగోలా సర్దుకుని పడుకున్నా, ఆవిడకి రాత్రులు బాత్‌రూమ్‌కి ఓ నాలుగయిదు సార్లయితే వెళ్లందే ఊరుకోదు. బాత్‌రూమ్ గదికి ఆనుకుని వుంది. తనూ, లక్ష్మి వుంటే ఆ గదిలోకి అన్నిసార్లు రావడానికి బామ్మకి వీలవదు.

అందుకే కనీసం రెండుగదులున్న ఇల్లు, జీతం డబ్బులు సరిపోకపోయినా ఎలాగోలా ఎడ్జెస్ట్ చేసుకుందామని అనుకుంటే దురదృష్టంకొద్దీ ఆ ఇల్లు దొరికి చావడంలేదు. మరి ఇప్పుడు లక్ష్మి వచ్చేస్తే ఎలా బామ్మ పరిస్థితి? అదీ రాంపండు సమస్య ఇప్పుడు.

అలా అని లక్ష్మిని తల చుకుంటూ వుండలేకపోతున్నాడు. పెళ్లి తర్వాత రోజే శోభనానికి ఆమె తల్లిదండ్రులు ముహూర్తం పెట్టారు. వాళ్ల ముసలి బాబాయి అనుకోకుండా హార్ట్ ఎటాక్‌తో చనిపోవడంతో ఆ శోభనం కాస్తా వాయిదాపడుతూ వచ్చింది.

''మావూళ్లో చేసుకుంటాం. ఇల్లు పెద్దది దొరకగానే ఉత్తరం రాస్తాం. అమ్మాయిని పంపించేయండి'' అని చెప్పి బామ్మ రాంపండుతో వచ్చేసింది.

నెలదాటినా ఇల్లు దొరకలేదు, దొరికినా ఇల్లు రాంపండుకి నచ్చలేదు. ఏదైతే అదే అయిందని లక్ష్మిని తీసుకు రమ్మని ఇపుడు ఆర్డర్ వేసింది బామ్మ.

అదీ సంగతి.

• • •

మంచిరోజు చూసుకుని మహాలక్ష్మి రానే వచ్చింది. ఉదయం వచ్చి ఆ సాయంత్రమే వెళ్లిపోయాడు వాళ్ల నాన్న వుండడానికి ఎలాగూ ప్లేస్ లేదని.

మహాలక్ష్మి ప్లేట్ నిండా అరిశలు, వడలు, సున్నుండలు పెట్టి తెచ్చింది రాంపండుకి.

''తీసుకోండి''

అతను ప్లేట్ అందుకుని పక్కన పెట్టేస్తూ ''ఇప్పుడిదా ఇవ్వవలసింది?'' అన్నాడు దగ్గరకి లాక్కుంటూ.

''మరి'' అంది ఆశ్చర్యంగా లక్ష్మి.

''ఓ చిన్న ముద్దు ఇచ్చుకో...'' అన్నాడు కళ్లు మూసుకుని బుగ్గ చూపెడుతూ.

''ఛీ ఛీ...సిగ్గులేదు'' అంటూ వెనక్కి జరిగింది లక్ష్మి.

''అరె ఎవరో పరాయివాడు అడిగితే అసహ్యించుకున్నట్లు అలా పెడతావేంటి ముఖం. నేను నీ భర్తని తెలుసా?'' అన్నాడు కాస్త గట్టిగా.

అతని ముఖంలోని కోపాన్ని గమనించిన లక్ష్మి భయపడుతూ అలాగే భయంగా అతని ముఖంలోకి చూడసాగింది. లక్ష్మి ఏడో తరగతి ఫెయిలయింది. ఈ తరం అమ్మాయే అయినా పల్లెటూరిలో పుట్టి పెరిగడం వలన సిటీలోని అమ్మాయిలంత ఫాస్ట్‌కాదు. ఉదయాన్నే చద్దన్నం తినేసి చింత గించలాడుకునే టైపు.

బెదురుతూ చూస్తున్న లక్ష్మిని దగ్గరకు లాక్కుని ''పోనీ నువ్వివ్వకపోతే నేనే ఇచ్చుకుంటాను'' అంటూ చటుక్కున బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు.

''రాత్రికి భోజనంలోకి ఏం వండమంటావురా పండూ'' వంటింట్లోనుండే అడిగింది బామ్మ.

లక్ష్మి గబుక్కున దూరంగా జరుగుతూ ''నే వెళ్తున్నా బాబు బామ్మ పిలుస్తున్నట్టుంది'' అంది.

''పిలిచింది నన్ను. నిన్ను కాదు'' అతను కౌగిట్లోకి లాక్కుంటూ అన్నాడు.

''ఛ వదలండీ. ఆవిడ చూస్తే ఏమనుకుంటుంది'' అంటూ అతని చేతులు తీసేసి వంటింట్లోకి పారిపోయింది.

''హు ఇక ఈ రాంపండుకి శోభనం కాదు కదా, ముద్దూ ముచ్చటా కూడా తీరే యోగం ఈ జన్మకి వుందో లేదో'' అనుకుంటూ తల పట్టుకుని కూర్చున్నాడు.

• • •

రాత్రి అవుతోందిగానీ బామ్మ రాంపండు శోభనం గురించి ఏ మాటా ఎత్తలేదు.

రాంపండుకి ఆశ్చర్యంగా వుంది.

శోభనం చేయించేస్తాను చేయించేస్తాను అని గోల పెట్టి లక్ష్మిని రప్పించి ఇప్పుడు ఇలా నిశ్శబ్దంగా ఊరుకుంటుందేవిటా అని అతనికి ఆశ్చర్యంగానూ, మరో పక్క కోపంగానూ వుంది. ఆఖరికి ఏడున్నరవుతూంటే ఆగలేక అడిగేశాడు.

''పూలు, పళ్లు, స్వీట్స్ తేనా బామ్మా!'' అని.

రాంపండు ఆత్రానికి ముసిముసిగా నవ్వుతూ ''అర్థమయిందిలేరా పండూ నీ ఆత్రం'' అంది.

''నీ ముఖం'' నవ్వేశాడు ఏడవలేక.

''ఈరోజు అంత బాలేదురా. నాలుగురోజుల తర్వాత దివ్యమైన ముహూర్తం వుంది. ఆరోజు ఖాయం చేస్తాను. అంతవరకూ ఓపిక పట్టు''

''తప్పదా బామ్మా!''

''నామాటంటే మాటే నీకు తెల్సుగా! ఈలోగా ఇల్లు వెతుకు'' రాంపండు బామ్మ మాటలకి తిట్టుకుంటూ అన్నం కూడా తినకుండా అలిగి ముసుగుతన్ని పడుకున్నాడు. అన్నం తినమని బామ్మ ఎంత బ్రతిమిలాడినా నాలుగురోజుల తర్వాత తింటాలే అని తెగేసి చెప్పాడు.

''వెధవ అన్నీ నా బుద్ధులే. మొండి ఘటం'' అని ఊరుకుంది బామ్మ.

• • •

మధ్యరాత్రిలో మెలకువ వచ్చిన రాంపండు, గదిలో లైట్ వేసి చూసేసరికి హాయిగా బామ్మ పక్కన చెయ్యి వేసుకుని పడుకున్న మహాలక్ష్మి కనపడింది.

హు! నాపక్కలో వుండవలసిన లక్ష్మిని నీ పక్కలో పడుకోపెట్టుకుంటావా! అనుకుంటూ పళ్లు నూరుకున్నాడు రాంపండు.

• • •

నాలుగురోజుల తర్వాత బామ్మ పెట్టిన ముహూర్తానికి మహాలక్ష్మికి, ఆడవాళ్ల మూడురోజుల అవాంతరం వచ్చి పడింది. రాంపండుకి మరింత పిచ్చెక్కింది.

ఆ తర్వాత వారం రోజులకి మరో ముహూర్తం పెట్టింది. సరిగ్గా ఆరోజు ఉదయమే బామ్మగార్కి అనుకోకుండా జ్వరం మొదలయింది. రాంపండు మనసు విలవిలలాడిపోయింది. బామ్మంటే ప్రాణం మరి!

ఎప్పుడైనా కోపం వచ్చినా అది కాసేపే. ప్చ్! నా రాతే అలా వుంది. ఏం చేస్తాం అని సరిపెట్టుకుని ఊరుకున్నాడు. అతనికి మహాలక్ష్మిని చూస్తూంటే ఊరుకోబుద్ధి అవడం లేదు. ఎదురుగా పంచభక్ష్య పరమాన్నాలు పెట్టి, నువ్వు ఉపవాసం వుండు అన్నట్టుగా వుంది అతని పరిస్థితి. అయినా ఏం చెయ్యలేని పరిస్థితి, తెగ విలవిలలాడిపోతున్నాడు. బామ్మకి జ్వరం త్వరగా తగ్గాలని, పది కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్నాడు కూడా. ఐదురోజుల తర్వాత బామ్మ జ్వరం తగ్గింది.

రెండుమూడు రోజుల్లో చూసి ముహూర్తం పెట్టించింది. రాంపండు సంతోషానికి హద్దేలేదు.

మరి మహాలక్ష్మి వచ్చి ఇరవై రోజులు దాటిపోతున్నా కేవలం చిన్న చిన్న ముద్దు మురిపాలతోనే ఇప్పటివరకూ సాగిపోయింది.

ఆరోజు పెట్టిన ముహూర్తానికి రాంపండు పూలు, పళ్లు అన్నీ కొనేసి తెచ్చేశాడు ఇంక ఏం అవాంతరం వచ్చినా ఆగేది లేదని. కానీ అనుకోకుండా ఆరోజు మధ్యాహ్నం బామ్మగారు బాత్‌రూమ్‌లో కాలు జారి పడింది.

డాక్టర్లు, ఎక్సరేలు, టెస్టులూ అన్నీ వెంట వెంటనే జరిగిపోయాయి. మొత్తానికి అదే ముహూర్తానికి బామ్మగారు వున్న ఒక్క మంచం మీద కాలు ఫ్రాక్చరై నలభయి రోజులు చెట్టు ఎక్కేసారు. తనకు వున్న ఒక్క బామ్మ మంచాన పడేసరికి దుఃఖం ముంచుకొచ్చింది రాంపండుకి. తన శోభనం సంగతి దేవుడెరుగు.

పాపం బామ్మ. ఇలా మంచాన పడిందేవిటి. గుండ్రాయిలా ఏదో ఒక పని చేసుకుంటూ పోయే ఆవిడకి ఇలా జరిగిందేవిటి అనుకుంటూ తెగ బాధపడిపోయాడు.

మహాలక్ష్మి కూడా చాలా బాధపడింది బామ్మగారి పరిస్థితికి. రెండునెలలు అయితేగానీ మంచం మీదనుండి లేవలేకపోయింది బామ్మగారు.

ఈసారి బామ్మ పంతుల్ని పిలిపించి ముహూర్తం పెట్టించింది. దీనికి తిరుగు లేదనుకున్నారంతా! వారం తర్వాత దివ్యమైన ముహూర్తం అంటూ పెట్టాడు ఆ పంతులు. కానీ ఆ ముందురోజే మహాలక్ష్మి అక్క డెలివరీ అయిందనీ, తప్పక పంపమని మామగారు ఫోన్ చేశారు. మహాలక్ష్మి వెళ్తానని ఒకటే గోల.

రాంపండుకి ఓ ఆలోచన వచ్చింది. తను కూడా వెళ్తే. తనకి, లక్ష్మికి ఎలాగైనా వేరే రూమ్ ఇస్తారు అత్తగారు. హాయిగా అక్కడ చేసేసుకోవచ్చు శోభనం అనుకున్నాడు.

కానీ కోనసీమకు టికెట్ ఖర్చు అంతా లెక్కలేసుకుని చూసుకునేసరికి ఆరువందలపైనే ఖర్చు కనపడింది.

''వామ్మో! ఆ ఆరువందలు దేనికైనా పనికొస్తాయని చెప్పి ఆ ఉద్దేశ్యం మార్చుకున్నాడు. శోభనం కోసం కక్కుర్తిపడితే తనకో ఆరేడు వందలు ఖర్చు. పైగా వాళ్లు పురుడి గోలలో వుంటారు. తనకి రూమ్ ఇవ్వకపోతే అని ఆలోచించుకున్న రాంపండు లక్ష్మినొక్కర్తినే రైలెక్కించాడు త్వరగా రమ్మంటూ.

పాపం శ్రీవారు అనుకుంటూ టాటా చెప్పింది లక్ష్మి.

తొందరగా వచ్చెయ్యమని చెప్పినా బారసాల అయినాక వస్తాను. మళ్లీ వచ్చివెళ్లడం రైలు ఖర్చులు దండగ అని లెటర్ రాసింది లక్ష్మి.

రాంపండు ఏం చేయలేక నిట్టూర్చాడు.

ఇరవయి ఒకటోరోజు బారసాల కాగానే వస్తానన్న లక్ష్మి మూడునెలల వరకూ రాలేకపోయింది. చంటిపిల్లాడికి ఒంట్లో బాగోలేని కారణాన వాళ్లు బారసాల మూడోనెలలో చేసుకోవలసి వచ్చింది.

తనని క్షమించమంటూ, ఫంక్షన్ కాగానే వస్తానని లెటర్ రాసింది లక్ష్మి. రాంపండు విరక్తిగా నవ్వుకున్నాడే తప్ప కోపం తెచ్చుకోలేదు.

• • •

లక్ష్మి వచ్చేసింది. హాయిగా పుట్టింట్లో రెస్టుగా వుండి, నిశ్చింతగా వుందేమో మునిపటికంటే తెల్లగా, లావుగా అయి మరింత అందంగా వున్నట్టు కనపడింది రాంపండుకి. బామ్మ కూడా మనవడిని చూసుకుని తెగ ముచ్చట పడిపోయింది. ఆ శోభనం ముహూర్తం కాస్తా పెట్టించి జరిపించేస్తే, ఏ మునిమనవణ్ణో ఎత్తుకుంటే చాలు, నాకింకే కోరికలూ లేవు'' అంటూ మొదలుపెట్టింది బామ్మ.

''శోభనం మాట ఎత్తితే, నిన్ను చంపేస్తా'' అన్నాడు రాంపండు.

''ఇంకో ఇల్లు దొరికేవరకూ నేను చేసుకోనుపో'' అన్నాడు.

బామ్మగారు ఎన్నివిధాల చెప్పిచూసింది. మొండిగా వున్నాడు రాంపండు. ''పెళ్లయి ఎనిమిది నెలలవుతున్నా ఏమీ విశేషం లేదా'' అంటూ చుట్టుపక్కలవాళ్లు ప్రశ్నలు మొదలుపెట్టారు.

బామ్మకి చాలా దిగులుగా వుంది.

''అవును. తను చచ్చిపోయేలోగా మునిమనవణ్ణి ఎత్తుకుంటుందో లేదో ఎలా'' అని ఒకటే దిగులు పెట్టుకుంది.

• • •

మరో నెలరోజులు అలాగే గడిచిపోయాయిగానీ ఇల్లు దొరకలా. బామ్మగారు ఓరోజు పక్కింటికి వెళ్లింది. పక్కింట్లో వుంటున్న సరోజ తల్లీ తండ్రీ యాత్రలకు వెళ్తున్నట్లుగా చెప్తే ఓ ఆలోచన వచ్చింది బామ్మగార్కి. వెంటనే అది అమలు చెయ్యదలచుకుంది.

సరోజ చేత తనకీ వాళ్లతోపాటు యాత్రలకి టికెట్టు తెప్పించుకుని, తనుకూడా వాళ్లతో వస్తానని చెప్పింది. వాళ్లు సంతోషంగా ఒప్పుకున్నారు.

తిరుపతి, మద్రాసు, మధురై, కన్యాకుమారి, రామేశ్వరం అన్నీ మొత్తం నెలరోజులు యాత్రలు.

హాయిగా తనకీ పుణ్యమూ దక్కుతుంది, రాంపండు వాళ్లకు ఏకాంతమూ చిక్కుతుంది అనుకుంది బామ్మగారు. తను యాత్రలకు వెళ్తానని చెప్పింది రాత్రికి రాంపండుకి. ఒక్కర్తివీ, పెద్దదానివి, వద్దు అన్నాడు రాంపండు. అయినా బామ్మగారు వినలేదు.

అన్నీ సర్దుకుంది. ఈసారి రాంపండు శోభనానికి ముహూర్తం పెట్టలేదు బామ్మ.

''ఒరే రాంపండూ. నేను నెలరోజులు తిరిగి వచ్చేసరికి మహాలక్ష్మి నెలతప్పి వుండాలి. తెలిసిందా? నా బుజ్జిపండువి కదూ! నాకో మునిమనవణ్ణి ఇచ్చేస్తే ఇంకేం అడగనురా నిన్ను.''

''నేను వెళ్లే ప్రతిచోటా ఏమని మొక్కుకుంటానో తెలుసా. మహాలక్ష్మికి కొడుకు పుట్టాలని. సరేనా నే వెళ్లనా?''

బిక్కముఖం వేసుకున్న రాంపండు దిగులుగా తల వూపాడు. బామ్మగారు మాత్రం సంతోషంగా చేయి వూపింది. ముహూర్తం పెట్టని శోభనానికి రాంపండు బయలుదేరాడు. ★